# అతను

అతను మరో రచనతో నాదగ్గరకు వచ్చాడు.

ఆ ముఖంలో ఇంకా చిరునవ్వు అలానే వుంది. ఈ వారంలో వరసగా ఇది నాలుగో కథ నాకివ్వటం. కథ అందించగానే నా కేసి చూస్తాడు.

వెంటనే చదివి ఏదో ఒక అభిప్రాయం చెబితే బాగుంటుందని అతని కుంటుందేమో.

నేను మాత్రం 'చదివి చెబుతాను' అంటాను.

అతనేం మాట్లాడకుండా వెళ్ళిపోతాడు.

ఇప్పటికి మూడు కథలు తిరస్కరించాను. అయినా అతనిలో ఎలాంటి నిరాశ కనపడలేదు. మరో రచనతో నా ముందుకు వస్తూనే ఉన్నాడు.

అతని రచనలు తిరస్కరించాలని నాకేం లేదు. కానీ నా కెందుకో ఈ యువకుడు చాలా చిత్రంగా కనిపిస్తున్నాడు. అతని వయసునూ, అనుభవాన్ని దృష్టిలోకి తీసుకుంటే మరింత తమాషాగా వుంది.

అతను స్పృశిస్తున్న సమస్యలు సాధారణమైనవికావు. అలాంటి విషయాలమీద తొందరపడి అతను అభిప్రాయాలు వెలిబుచ్చుతున్నాడు.

అయినా అతనికి ఏం తెలుసునని ఇలాంటి విషయాలు ఎన్నుకుంటున్నాడు? అందుకే ఒక్కోసారి చిరాకు కలుగుతుంటుంది.

అయితే ఆ ముక్క అతని ముఖాన అనాలనిపించటంలేదు. అందుకు కారణం అతను బాధపడ్తాడని కాదు. ఆ యువకుడి రచనల్లో ఎన్ని పరిమితులున్నా ఆ వేగం నన్నాకర్షించింది.

రెండోది నేను మరో కోణం నుండి ఆలోచించాలేమో-ఈ సీట్లో కూర్చున్నాను. నాకిక్కడ కొన్ని పరిమితులున్నాయి. ఆ పరిమితుల్లోపల ఆ యువకుడి రచనలు ఉంటున్నాయా అనేది కూడా ఓ సమస్య.

అదే సమయంలో "పర్వాలేదు చూద్దాం" అనుకున్న రచనలు సైతం అతను గుర్తొస్తే ఎందుకో చేతులు రావటంలేదు. నా కతన్ని పిలిచి....

"చూడు బాబూ...నీ రచనల్లో ఓ వేగం వుంది. అంగీకరిస్తా. నీ భావాలు ఓ క్రమంలో ఉండటంలేదు. అవి ఒక్కసారిగా ఉబికిన గ్యాస్‌లా ఉంటున్నాయి. అంటే ఓ రకమైన అల్లకల్లోలం అందులో కనిపిస్తోంది. నువ్వింకా బాగా చదవాలి. పుస్తకాల్నే కాదు. జీవితాల్ని కూడా. అప్పుడైతే ఇంకా బాగా రాస్తావు" అని చెప్పాలనిపించింది.

అంతలోనే మరో సంశయం!

ఏం—ఆ యువకుడేనా అధ్యయనం చేయాల్సింది. ఈ ప్రపంచంలో శాశ్వతమైన సత్యాలూ, సమగ్రమైన రచనా అని చెప్పుకోటానికి ఏమైనా ఉన్నాయా?

మరలాంటప్పుడు అతని రచనలు తిరస్కరించటం ఎందుకు?

ఈ సారి మాత్రం అతనికిలా చెప్పాలనుకుంటున్నా

"బాబూ...నీ రచనలు బాగుండలేదని మాత్రం తిరస్కరించటం లేదు.

మా పత్రిక పరిమితులకు లోబడి మాత్రమే తిరస్కరిస్తున్నాం"

నిజంగానే మా చుట్టూ మేం గోడలు కట్టుకున్నామా అని అనిపించిన క్షణాలు లేకపోలేదు.

అతను వెళ్ళిపోయి అయిదు నిముషాలు కావస్తోంది. అయినా ఎందుకో తను నా ముందు నిలబడినట్లే ఉన్నాడు. నేను అతనందించిన కవరు చూశాను అందులో ఓ కాయితం ఉంది.

ఆ లేఖ నాకు రాసింది!

"క్షమించండి. దీర్ఘంగా రాస్తున్నందుకు మన్నించండి. ఏమిటీ కుర్రాడు ఓ రచన కాదంటే మరో రచనతో వస్తున్నాడనుకోకండి. అంతే కాదు నేను రాస్తున్న విషయాలు ఎంత జటిలమైనవో నాకు తెలుసు. వాటి లోతుల్లోకి వెళ్ళగలిగే అవగాహనా, శక్తి నాకు పరిమితంగా ఉన్నాయనే విషయం నాకు అర్థమౌతూంది. కానీ ఓ ఆరాటం, ఓ ఆవేశం నాచేత రాయిస్తున్నాయి. నేను రాయకుండా ఉండలేక పోతున్నాను.

అంతేకాదు. ఇలాంటి సమస్యల మీద ఎవరు రాయాలో వారు రాయటంలేదు. వారెందుకనో మౌనంగా ఉండిపోయారు. నేను రాయటానికి అదికూడా ఓ కారణం అనుకుంటాను. నా రచనల్లోని లోపాలూ, పరిపక్వత లేకపోవటం ఇవన్నీ గమనించాకయినా రాయవలసినవారు రాయకపోతారా అనే ఆశతో రాస్తున్నా. ఇంకో విషయంకూడా ఉంది. ముందు ఇలాంటి విషయాల్ని చర్చకు పెట్టవచ్చు. అప్పుడు విభిన్నమైన అభిప్రాయాలు వస్తాయి. ఏది మంచిదో ఎన్నుకునే స్వేచ్ఛ పాఠకుడికే వుంటుంది.

మీరు నా రచనలు తిరస్కరిస్తున్నారనే ఆలోచన నాకు రావటం లేదు. నా రచనల్లో ఏవో లోపాలు ఉండి వుంటాయి. అవి చెప్పమని నేను మిమ్మల్ని నిర్బంధించలేను. మీరెంత తీరికలేని పనుల్లోవుంటారో నాకు తెలుసు కనుక.

ఏదిఏమైనా రాయటం నాకు ఆనందాన్నిస్తుంది. రాయటం నాకు ప్రేరణనిస్తుంది. ఇక ముందూ అందుకే రాస్తాను. వీలయితే నా రచనల

మీద మీ అభిప్రాయం చెప్పండి. లేదా తిరస్కరించండి. అంతేగాని ఇంక రచనలు పంపవద్దని మాత్రం అనకండి."

తిరిగి ఈ ఉత్తరంలోనూ నాకు నచ్చేవీ, నచ్చనివీ వున్నాయి. గోర్కీ ఎక్కడో చెప్పాడు "రచయితల కుండాల్సిన లక్షణాల్లో రాయకుండా ఉండ లేకపోవటం కూడా ఒకటని!"

అంతేగాదు. అతని రచనల్ని ఇక్కడ కూర్చుని నేను నిర్ణయించటం ఎందుకు?

అతని రచనలు అవసరమా కాదా అనేది పాఠకులు నిర్ణయిస్తారు.

మరోసారి అతని లేఖ చదివాను.

"నేను రాయకుండా ఉండలేక పోతున్నాను."

ఆ అక్షరాల మీదే నా దృష్టంతా

ఏం చెయ్యను మరి...

ఇప్పుడిక అతని రచనని

ప్రచురించకుండా వుండటం నాకూ సాధ్యం కావటం లేదు.

—ప్రజాసాహితి